పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతులు సాధించాలి

- అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలి
- మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మిగిలిన అనుమతులు సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత వి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. క్యాబినెట్ మొత్తం ప్రధానమంత్రిని కలుస్తారా? అనేది తేల్చుకోవాలన్నారు. ఆ ప్రాజెక్టు కోసం అఖిలపక్షాన్ని ఢిల్లి తీసుకువెళ్లాలని కోరారు. బిఆర్ఎస్ త్వరలోనే కార్యాచరణ చేపడుతుందనీ, రైతు సంఘాలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. 12 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని సిఎం రేవంత్ రెడ్డి చెబితే, ఆ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇవ్వడం లేదని శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేశారు. డిపిఆర్ ను వెనక్కి పంపించిందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయిన ఈ ప్రాజెక్టుపై ఎపి ప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసిందని తెలిపారు. అయితే తెలంగాణకు రావాల్సిన మూడు అనుమతులను ఎపి ప్రభుత్వం ఆపిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉండి పాలమూరు జిల్లాను దత్తత తీసుకుని ఏం చేయలేదనీ, ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చి నెరవేర్చలేదని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టుపై పెత్తనం చేయాలని ఎపి ప్రభుత్వం చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎపి ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో నిరసన
- జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు, దిష్టిబొమ్మలు దహనం

నిరసన తెలుపుతున్న పాలడుగు భాస్కర్, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను కేంద్ర హోం మంత్రి అవమానించారన్నారు. అమిత్ షా మాటల్లో అహంకారం, మనువాద దృక్కోణం దాగి ఉన్నాయన్నారు. అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు, పార్లమెంటుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కార్మికులు పనిచేసే అన్ని కేంద్రాల్లో నిరసనలకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. అమిత్ షా వాఖ్యలను ప్రధాని ఖండించకపోగా సమర్థించే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగాన్ని ఒప్పుకోని మనువాదుల వారసత్వ పార్టీ బిజెపి అని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని పూర్తిగా రూపుమాపే పద్ధతిలో పనిచేస్తోందని ఆరోపించారు. కార్మిక హక్కులను పూర్తిగా కాలరాస్తున్నదన్నారు. వచ్చే సంవత్సరం ఏప్రిల్ నుంచి కార్మిక చట్టాలన్నింటినీ నాలుగు లేబర్ కోడ్‌లుగా అమలు చేసే ప్రయత్నంలో ఉందన్నారు. దేశంలో ఉద్యోగాలు లేక యువత, గిట్టుబాటు ధరల్లేక రైతు, వేతనాల కోసం కార్మికులు అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్న క్రమంలో అమిత్ షా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం.. ప్రజా ఉద్యమాలను పక్కదారి పట్టించడం కోసమేనని అన్నారు. సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాతకు అవమానం జరిగిందన్నారు. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర నాయకులు సోమన్న, నగర అధ్యక్షులు కుమారస్వామి, నాయకులు సి.మల్లేష్, డీఎల్.మోహన్, జి.రాములు, ఎం.సత్యనారాయణ, మహేందర్, మల్లయ్య, జగదీశ్వర చారి పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని సిఐటియు జిల్లా నాయకులు కూకటికారి బుచ్చయ్య, జన్నారం మండల కన్వీనర్ అంబటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. రాజాపూర్ మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

ఘనంగా బిఒఐ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ) గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సుల్తాన్‌బజార్‌లోని ఆ శాఖలో 50 ఏళ్ల వార్షికోత్సవ ఉత్సవాలను జరిపినట్లు తెలిపింది. ఈ సందర్భంగా పలువురు వినియోగదారుల మధ్య కేక్ కట్ సెలబ్రేట్ చేయడంతో పాటుగా పలువురు ఖాతాదారులను సత్కరించినట్లు వెల్లడించింది. వినియోగదారులకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని పేర్కొంది.

సమావేశంలో మాట్లాడుతున్న విపి సాను

నూతన విద్యావిధానం వెనక్కి తీసుకునేంత వరకు పోరాడుతాం

- ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన విద్యా విధానం రద్దు చేసేంత వరకు పోరాడుతామని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను తెలిపారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పెరుమండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్రం నిర్ణయమైన నూతన జాతీయ విద్యా విధానం-2020 వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని, బాలిక విద్య మరింత దిగజారుతున్నదని, దాంతో బాల్య వివాహాలూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా విధానం సెంట్రలైజేషన్, కమర్షియలైజేషన్, కమ్యూనలైజేషన్‌కు కేంద్రంగా ఉందని అన్నారు. సామాజిక న్యాయాన్ని విస్మరించి, మను ధర్మ శాస్త్ర ఎజెండాను అమలు చేసేందుకే ఈ విద్యావిధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పరిశోధక విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం ఫెలోషిప్ ఇవ్వాలని కోరారు. స్వాతంత్ర్యోద్యమంలో భగత్ సింగ్ లాంటి వీరుల త్యాగాల వారసత్వాన్ని తలకెత్తుకొని విద్యార్థుల పోరాట పటిమను కొనసాగించడానికి 'స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం' లక్ష్యాలతో పురుడు పోసుకున్నదే ఎస్ఎఫ్ఐ అని అన్నారు. ఎస్ఎఫ్ఐ ఏర్పాటై నేటికి 50ఏండ్లు గడిచిపోయిందని, నాటి నుంచి దిన దిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ 50 లక్షలకు పైగా సభ్యత్వంతో దేశంలో అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఉందని అన్నారు. 'అధ్యయనం-పోరాటం' నినాదాలతో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం రాజీలేని పోరాటాలను నిర్వహిస్తోందని తెలిపారు. అందుకే జెఎన్‌యూ నుంచి హెచ్‌సియు వరకు స్టూడెంట్స్ ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ విజయం సాధిస్తోందని అన్నారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజురోజుకు విద్యారంగం దివాళా తీస్తుందని, ఫుడ్ పాయిజన్ ఘటనలు, గురుకులాల్లో అనేక సమస్యలు బయటకు వచ్చినా వాటిని ప్రభుత్వం పెడ చెవిన పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ వసతిగృహాలు, యూనివర్శిటీల్లో సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యారంగానికి తక్షణమే మంత్రిని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర వీరభద్రం, మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ పట్ల మధు, జిల్లా కో కన్వీనర్లు గుగులోతు సూర్యప్రకాశ్, గందసిరి జ్యోతిబసు, దీపిక, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా నాయకులు సింహాద్రి, భూక్యా రాజేష్, ప్రవీణ్, వినయ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు

టెట్ అభ్యర్థులు మెహిందీతో రావద్దు

- పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లు మూసివేత
- జనవరి 2 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తు చేసిన అభ్యర్థులు హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముంది. రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పేపర్-1కు 94,335 మంది, పేపర్-2కు 1,81,438 మంది కలిపి మొత్తం 2,75,773 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. హాల్‌టికెట్ల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. హాల్‌టికెట్లలో అభ్యర్థులు పాటించాల్సిన ముఖ్యమైన మార్గదర్శకాలను పొందుపర్చింది. వచ్చే నెల రెండు నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం (సిబిఆర్‌టి)లో రాతపరీక్షలు జరుగుతాయి. వచ్చేనెల ఎనిమిది, తొమ్మిది, పది, 18 తేదీల్లో పేపర్-1, అదేనెల రెండు, ఐదు, 11, 12, 19, 20 తేదీల్లో పేపర్-2 పరీక్షలను నిర్వహిస్తారు. ప్రతిరోజూ రెండు విడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులు చేతులపై మెహిందీ (గోరింటాకు) వేసుకుని పరీక్షకు హాజరు కావొద్దని విద్యాశాఖ అధికారులు సూచించారు. బయోమెట్రిక్ హాజరు విధానం అమల్లో ఉంటుంది. పరీక్ష ప్రారంభానికి రెండు గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారు. మొదటి విడత పరీక్షకు ఉదయం 7.30 గంటల నుంచి, రెండో విడతకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి ఉంటుంది. మొదటి విడతకు ఉదయం 8.45 గంటలకు, రెండో విడతకు మధ్యాహ్నం 1.45 గంటలకు అంటే పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేస్తామని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థులు బ్లాక్/బ్లూ పెన్ను, హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పాన్, ఓటరు గుర్తింపు)ను వెంట తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థులు క్యాలికులేటింగ్ పరికరాలు, లాగరిథమ్ టేబుళ్లు, క్యాలిక్యులేటర్, పేజర్, సెల్‌ఫోన్లు (స్విచ్ఛాఫ్ చేసి కూడా), స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు వంటివి పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావడానికి అనుమతి లేదని విద్యాశాఖ తెలిపింది. సాంకేతిక కారణాలతో వచ్చేనెల 11న మొదటి విడత, 20న జరిగే మొదటి, రెండో విడతల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచలేదని పేర్కొంది. శనివారం వారి హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేసింది.

మన్మోహన్‌సింగ్ గొప్ప ఆర్థికవేత్త

- సిఎం రేవంత్‌రెడ్డి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక వేత్త, మహా నాయకుడు, సంస్కరణవాది అన్నింటికి మించి గొప్ప మానవతావాది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధానమంత్రి మరణంపై ఎక్స్‌లో తన సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని సిఎం తెలిపారు. నిర్ణయాలు తీసుకోవడంలో మన్మోహన్ సింగ్ సమగ్రత, పారదర్శకత అన్నింటికీ మించి మానవీయ స్పర్శను జోడించేవారని, నవ భారత శిల్పుల్లో మన్మోహన్ సింగ్ ఒకరని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. రాజకీయ, ప్రజా జీవితంలో గౌరవ మర్యాదలు ఎలా పాటించాలో ఆయన తన ప్రవర్తన ద్వారా చూపించారని సిఎం పేర్కొన్నారు.

రావుల సంతాపం

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పట్ల రాజ్యసభ మాజీ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. తాను 2002 నుండి 2008 వరకు రాజ్యసభ సభ్యునిగా, ఫ్లోర్ లీడర్‌గా తాను లేవనెత్తిన పలు అంశాలను ప్రస్తావిస్తూ... ఆయన చెప్పిన సమాధానాలు ఇంకా తనకు గుర్తున్నాయని పేర్కొన్నారు. అసమాన్య ఆర్థిక వేత్తను, పరిపాలన దక్షుడిని దేశం కోల్పోయిందని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణం పట్ల పలువురు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సంతాపం తెలిపారు. టిపిసిసి అధ్యక్షులు బొమ్మన మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపి వి హనుమంతరావు, ఎంపిలు మల్లు రవి, బలరాం నాయక్, చామల కిరణ్ రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కోట నీలిమ, వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తదితరులు సంతాపం ప్రకటించారు.

వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు ఇవ్వాలి

- మంత్రి సీతక్కకు వ్యవసాయ కార్మిక, సామాజిక సంఘాల నేతల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీకి సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు ఇవ్వాలనీ, లబ్దిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ రైతు స్వరాజ్య వేదిక నాయకులు వి కిరణ్, కొండల్, హర్ష డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క)కు వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధిహామీ పనులు 100 రోజులు చేయాలి..ఆధార్‌కార్డు, పట్టాపాసుబుక్కుల ఆధారంగా ప్రభుత్వం ముందుకెళ్తుందనే ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పనులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ రూ.12 వేలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో భూమి లేని పేదలు 40 లక్షల మందిదాకా ఉన్నారనీ, వారికి రూ.1200 కోట్లు సరిపోవని చెప్పారు. మొత్తం లబ్దిదారులకు రూ.4800 కోట్లు కేటాయించాలని మంత్రికి విన్నవించారు. వ్యవసాయ కార్మికులపై సర్వే చేసి వారి పేర్లతో కూడిన రిజిస్టర్‌ను గ్రామపంచాయతీల్లో ఉంచాలని సూచించారు. గ్రామీణ పేదల లబ్ది చేకూర్చడం కోసం తీసుకొస్తున్న ఈ పథకం విధివిధానాల రూపకల్పనలో వారి హక్కుల కోసం పనిచేస్తున్న సంఘాలు, సంస్థల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకోవాలని విన్నవించారు. ఎకరం, అరెకరం ఉన్న రైతులను కూడా వ్యవసాయ కూలీలుగా పరిగణించి వారికి కూడా లబ్దిచేకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

నేడు చర్లపల్లిలో సిఐటియు రాష్ట్ర సెమినార్

- హాజరుకానున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు అఖిల భారత పూర్వ అధ్యక్షులు, ఇ.బాలానందన్ శత జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా "మతోన్మాదం - రాజ్యాంగ హక్కుల పరిరక్షణ" అంశంపై శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చర్లపల్లిలో రాష్ట్ర సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఆ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఎ అశోక్, ప్రధాన కార్యదర్శి జె.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని చర్లపల్లి ఫేజ్-2 చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ (సిఐఎ) హాల్‌లో శనివారం సాయంత్రం 5 గంటలకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన సెమినార్ జరగనున్నట్టు పేర్కొన్నారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, సిఐటియు ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు ప్రధాన ఉపన్యాసం చేస్తారన్నారు. వక్తలుగా సిఐటియు సీనియర్ నాయకులు పి రాజారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా పరిధిలోని వివిధ పారిశ్రామికవాడ పరిశ్రమల కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై సెమినార్‌ను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. మతోన్మాదులు, కార్పొరేట్లు రాజ్యాంగ హక్కులను కాలరాసేందుకు కుట్రలు చేస్తున్నాయని, వీటిని పోరాట శక్తితోఅడ్డుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు చెప్పారు.

ఆశాల శ్రమను గుర్తించని పాలకులు

- ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాల్సిందే : పి జయలక్ష్మి
- స్కీమ్ వర్కర్ల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం : బండారు రవికుమార్
- ములుగు, భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో బస్సు జాతాకు ఘన స్వాగతం

బస్సు జాతాలో పాల్గొన్న పి జయలక్ష్మి, బండారు రవికుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశాలతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న పాలకులు వారి శ్రమను గుర్తించడం లేదని, పారితోషికాలు లేకుండా అనేక పనులు చేయించుకుంటున్నారని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి అన్నారు. రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాల బస్సు జాతా శుక్రవారం ములుగు, భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో సాగింది. ఈ సందర్భంగా బస్సు జాతాకు ములుగు జిల్లా కేంద్రంలోని బోనాలు, బతుకమ్మలు, కోలాటం నృత్యాలతో ర్యాలీగా ఘన స్వాగతం పలికారు. కలెక్టరేట్ సెంటర్‌లో ఆర్ నీలాదేవి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోనూ బోనాలు ఎత్తుకుని, కోలాటం ఆడుతూ ఆశాలు ర్యాలీగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి బంధు సాయిలు అధ్యక్షతన సభ నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంజనపురి కాలనీకి చేరుకున్న ఆశా వర్కర్స్ బస్సుజాతాకు శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాంబాబు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో జయలక్ష్మి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో రూ.18 వేల వేతనం ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఆశాల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఆశాలకు వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. నిరంతరం ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికీ పారితోషకం రూ.9700 మాత్రమే ఇస్తున్నారని, కొన్ని సందర్భాల్లో ఈ డబ్బులు కూడా అందరికీ సమానంగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, హర్యానా, మహారాష్ట్రలలో మాదిరిగా తెలంగాణలో కూడా రూ.18000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం జరిగే రాష్ట్రవ్యాప్త బస్సు జాతాలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ మాట్లాడుతూ.. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, విఒఎలు తదితర స్కీమ్‌లలో పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వాలు నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 17 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న 1,20,000మంది అసంఘటిత కార్మికులకు కనీస వేతనం నిర్ణయించి అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. సంఘీభావంగా సిపిఎం ములుగు జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పి.గంగామణి, ఆర్ నీలాదేవి, కె సునీత, ఆర్.సాధన, ఎస్ పద్మ, ఎం బాలమణి, ఆశా వర్కర్లు విజయ, అరుణ, సిఐటియు నాయకులు చెరుకు సత్యం, హెల్త్ డిపార్ట్‌మెంట్ శ్రవణ్ కుమార్, విప్లవ, లత తదితరులు పాల్గొన్నారు.

పిఎస్‌బిలకు రూ.1.5 లక్షల కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు రూ.1.5 లక్షల కోట్ల లాభాలు సాధించొచ్చని ఆర్‌బిఐ అంచనా. తగ్గుతున్న మొండి బాకీలు, రెండంకెల స్థాయిలో రుణాల జారీ బ్యాంక్‌లకు లాభాలకు మద్దతును అందించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1)లో 25 శాతం వృద్ధితో రూ.85,520 కోట్ల లాభాలు ఆర్జించాయి. ఇంతక్రితం ఏడాది హెచ్1లో రూ.68,500 కోట్ల లాభాలు నమోదు చేశాయి. 2023-24లో రూ.1.41 లక్షల కోట్ల నికర లాభాలు సాధించాయి.

దళిత హెచ్‌ఎం రాములుపై మతోన్మాదుల దాడి

- డిటిఎఫ్, బిటిఎ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు (జిహెచ్‌ఎం) రాములు (దళితుడు)పై మతోన్మాద మూకలు భక్తి ముసుగు వేసుకుని ఉద్దేశపూర్వకంగా దాడి చేయడాన్ని డిటిఎఫ్, బిటిఎ తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎం సోమయ్య, టి లింగారెడ్డి, బిటిఎ అధ్యక్షులు కల్పదర్శి చైతన్య శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

గ్రామ పంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె

- ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్
- మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని వినతి

నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, వేతనాలు పెంచి ప్రభుత్వమే కార్మికులకు చెల్లించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా టోకెన్ సమ్మె చేపట్టారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ముందు టోకేన్ సమ్మె చేపట్టారు. గ్రామ పంచాయితీ సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. ముందుగా మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల జనవరి 4వ తేదీ తర్వాత ఎప్పుడైనా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట టోకెన్ సమ్మె నిర్వహించారు. కందుకూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తా వరకు పంచాయతీ కార్మికులు సిఐటియు ఆధర్వ్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని జిపి కార్మికులు చేస్తున్న టోకెన్ సమ్మెకు సిఐటియు ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కన్వీనర్ కూటికల ఆనందరావు మద్దతు తెలిపారు. ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన టోకెన్ సమ్మె చేపట్టారు. ఎన్నికల సమయంలో గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వేర్చాలన్నారు. రెబ్బెన మండల కేంద్రంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా చేపట్టారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మున్సిపల్ టౌన్ హాల్ నుంచి భారీ ర్యాలీగా వెళ్లి తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మర్రికుంట పాలకేంద్రం నుంచి పాత కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో కార్మికులు టోకెన్ సమ్మె నిర్వహించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో విధులను బహిష్కరించి నిర్వహించిన సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మిక జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పాల్గొని ప్రసంగించారు. సిద్దిపేట జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మెలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి, గజ్వేల్‌లో సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య పాల్గొని ప్రసంగించారు.

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం, కారేపల్లి, బోనకల్ మండల పరిషత్ కార్యాలయాల ఎదుట జీపీ కార్మికులు టోకెన్ సమ్మె చేపట్టారు. శుక్రవారం సెలవ్ కావడంతో కొద్దిసేపు ఆందోళన చేపట్టి వెళ్లిపోయారు. భద్రాచలం మండలం పంచాయతీ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ప్రారంభించి మణుగూరు, బూర్గంపాడు, అశ్వారావుపేట, పినపాక, ములకలపల్లి, దుమ్ము గూడెం, దమ్మపేట మండలాల్లో టోకెన్ సమ్మెకు సిఐటియు, జెఎసి, సిపిఎం నాయకులు మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్నారు.

'గల్లా పెట్టె'పై నజర్..

- ఆర్థిక వనరుల సమీకరణపై సర్కారు దృష్టి
- చేయూతపై సమాలోచనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకవైపు తీవ్రమైన ఆర్థిక కష్టాలు, అప్పులు, వడ్డీలు, కిస్తీలతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం...మరోవైపు ఎలాగైనా ఆర్థిక వనరులను సమకరించుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉన్న అన్ని వనరులనూ సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవటం, ఆ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు ఆశగా ఎదురు చూస్తుండటం తదితర పరిణామాల నేపథ్యంలో ఖజానాను నింపుకోవటంపై సర్కారు సీనియస్‌గా దృష్టి సారించింది. ఇందులో భాగంగా తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఐఐసి) పరిధిలో ఉన్న భూములను తనఖా పెట్టటం ద్వారా రూ.20 వేల నుంచి రూ.30 వేల కోట్ల వరకూ సమీకరించుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు విశ్వసనీయ సమాచారం. ఇందుకోసం ఆ సంస్థకు చెందిన ఉన్నతాధికారులు కొద్ది రోజుల క్రితం ముంబయి వెళ్లి, పలువురు బ్యాంకర్లతో సమావేశమైనట్టు తెలిసింది.సంక్రాంతి నుంచి రైతు భరోసాను అమల్జేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన సంగతి విదితమే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకసారి మాత్రమే రైతు భరోసాను విడుదల చేశారు. అందుకు గత బిఆర్ఎస్ సర్కారు పాటించిన విధి విధానాలనే ప్రామాణికంగా తీసుకున్నారు. ఆ ప్రకారంగా ఎకరాకు రూ.5 వేల చొప్పున్నే రైతుల ఖాతాల్లో జమ చేశారు. కానీ కాంగ్రెస్ తన ఎన్నికల హామీల్లో భాగంగా ఎకరాకు రూ.7,500 ఇస్తామంటూ ప్రకటించింది. ఇప్పుడు ఆ వాగ్దానాన్ని విధిగా అమలు చేయాల్సి ఉంది. అందుకోసం సాలీనా రూ.15 వేల కోట్లు అవసరమవుతాయని ఆర్థికశాఖ లెక్కలేసింది. మొత్తంగా రైతు భరోసాతోపాటు ఈ రెండింటికీ కలిపి రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్లు కావాలి. భూములను తనఖా పెట్టటం ద్వారా ఈ మొత్తాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ముస్తాబైన నల్లగొండ

- నేటి నుంచి టిఎస్‌యుటిఎఫ్ 6వ రాష్ట్ర మహాసభ
- 29, 30న ప్రతినిధుల సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర 6వ విద్య వైజ్ఞానిక రాష్ట్ర మహాసభ కోసం నల్లగొండ పట్టణం ముస్తాబైంది. పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో షేక్‌మహబూబ్‌అలీ ప్రాంగణంలో ఎన్ బలరాం వేదికగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో మహాసభ జరగనుంది. నల్లగొండ ప్రధాన కూడలిలో యుటిఎఫ్ తోరణాలు మహాసభకు విచ్చేసే ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్నాయి. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం లక్ష్యంగా, ఉపాధ్యాయుల, బోధనేతర సిబ్బంది సమస్యల పరిష్కారం దిశగా, ప్రభుత్వ రంగంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రభావితం చేసే విధంగా తదితర అంశాలపై ఈ మహాసభలో చర్చించబోతున్నారు. రెండు మాసాలుగా మహాసభ ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పాఠశాలనూ సందర్శించి ఉపాధ్యాయ వర్గాలను చైతన్యపరచడం కోసం కరపత్రికలు అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి విద్య వైజ్ఞానిక మహాసభను జయప్రదం చేసే విధంగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు.

మహాసభ కోసం ఆహ్వానసంఘం చైర్మన్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు తీవ్రంగా శ్రమించారు. శుక్రవారం మహాసభ ప్రాంగణం వద్ద ఏర్పాట్లను నర్సిరెడ్డి పరిశీలించారు. ఆయన వెంట యుటిఎఫ్ జిల్లా నాయకులు ఉన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

లక్ష్మీ గార్డెన్‌లో బహిరంగ సభ

మొదటి రోజు ఈ నెల 28న నల్లగొండలోని లక్ష్మిగార్డెన్ ఆవరణలో 7000 మంది ఉపాధ్యాయులతో భారీ బహిరంగ సభ జరగనుంది. సభకు ముందు పట్టణంలో ఉపాధ్యాయుల మహాప్రదర్శన ఉంటుంది. ఉదయం పది గంటలకు పతాకావిష్కరణ, పదిన్నర గంటలకు వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభమవుతాయి. పదకొండు గంటలకు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య ఆధ్వర్యంలో సభ ప్రారంభం కానుంది. ప్రారంభ సభకు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్డు భవనాలు, సినిమా ఫోటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విద్యాసదస్సులు ప్రారంభమవుతాయి. 'భారత ఆర్థిక వ్యవస్థలో మధ్యతరగతి ప్రజలకు ఏం జరుగుతుంది' అనే అంశంపై ప్రొఫెసర్ కె నాగేశ్వర్, రాజ్యాంగ విలువలపై సీనియర్ పాత్రికేయులు, ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్, 'జాతీయ విద్యా విధానం- ప్రభుత్వ విద్యపై ప్రభావం' అంశంపై ఎస్ఎఫ్ఐ జాయింట్ సెక్రెటరీ కుమారి ఆయిష్ ఘోష్ ప్రసంగించనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. దీనికి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ హాజరవుతారు. 29, 30 తేదీల్లో ప్రతినిధుల మహాసభ ఉంటుంది. అనంతరం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక ఉంటుంది. అదేవిధంగా ఈ మహాసభలో ప్రత్యేకంగా ఎనిమిది స్టాళ్ల ద్వారా చిత్ర ప్రదర్శనలు, బోధన అంశాలతో వైజ్ఞానిక ప్రదర్శనలు జరగనున్నాయి.

ప్రజావాణిలో 154 అర్జీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 154 అర్జీలు అందాయి. ప్రజావాణి ఇన్‌ఛార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ అంశాలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అర్జీలపై ఎండార్స్‌మెంట్ చేసిన చిన్నారెడ్డి, దివ్య సమస్యలను పరిష్కరించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మతి చెందిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సెలవు దినంగా ప్రకటించినప్పటికీ ఈ సమాచారం తెలియక వచ్చిన ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగించారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి 59, విద్యుత్ 26, రెవెన్యూ 18, హోంశాఖ ఎనిమిది , వ్యవసాయ ఐదు, ఇతర శాఖలకు సంబంధించి 38 అర్జీలు ప్రజావాణికి అందాయి.

కెటిఆర్‌ను 31వరకు అరెస్టు చేయొద్దు హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కెటిఆర్‌ను అరెస్ట్ చేయకుండా గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఉన్నత న్యాయస్థానం ఈనెల 31 వరకు పొడిగించింది. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. గతంలో హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ కేసుపై ఎసిబి కౌంటర్ దాఖలు చేసింది. కెటిఆర్‌ను అరెస్ట్ చేయకుండా జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరింది.

మన్మోహన్‌సింగ్ యువతరానికి ఆదర్శం

- కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ యువతరానికి ఆదర్శమని, ఆయన మరణం దేశానికి తీరని లోటు అని కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మితభాషి, సౌమ్యుడు, స్థితప్రజ్ఞకలిగిన నేత అని కొనియాడారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకురావడంలో అప్పటి ప్రధాని పీవీతో కలిసి కీలక భూమిక పోషించారని గుర్తుచేశారు. ఆరోగ్యం బాగాలేకపోయినా వీల్‌చైర్‌లో పార్లమెంట్‌కు రావడం ఆయనకు చట్టసభల మీద ఉన్న గౌరవాన్ని తెలుపుతున్నదని పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల సంతాపం తెలిపించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది : కూనంనేని

ప్రముఖ ఆర్థిక వేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని వివరించారు. ఆర్థికవేత్తగా, అధ్యాపడిగా, రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, ప్రధానమంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహించి పదేండ్లపాటు ప్రధానమంత్రిగా ఆయన దేశంలో అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు చిన్నారెడ్డి నివాళులు

మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు రాష్ట్ర ప్రణాళికా సంఘం చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, ప్రజావాణి అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం మహాత్మాజ్యోతిబా పూలే ప్రజాభవన్ సంతాప కార్యక్రమంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి చిన్నారెడ్డి, దివ్య, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి చిన్నారెడ్డి మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ గొప్ప ఆర్థిక సంస్కర్త అని వ్యాఖ్యానించారు. దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా తన మెదస్సుతో దేశాన్ని ఆర్థికంగా గట్టెక్కించిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం వంటి గొప్ప కార్యక్రమాలకు మన్మోహన్‌సింగ్ శ్రీకారం చుట్టారని తెలిపారు. పదేండ్లపాటు దేశ ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ చేపట్టిన అనేక సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తి అని అభిప్రాయపడ్డారు.

జెబి రాజు సత్కరిస్తున్న గీతారెడ్డి తదితరులు

పేద దళిత వర్గాల జన బాంధవుడు జెబి రాజు

- రాష్ట్ర పూర్వ మంత్రి జె గీతా రెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

అంకితం భావం, చిత్త శుద్ధితో పేద దళిత వర్గాల సమస్యలపై పోరాడిన జన బాంధవుడు జెబి రాజు అని రాష్ట్ర పూర్వ మంత్రి జె గీతారెడ్డి కొనియడారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతి లయ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో ఎస్సి, ఎస్‌టి, బిసి, మైనారిటీస్ ఆర్గనైజేషన్ అభినందనలతో అంబేద్కర్ వాది జెబి రాజు 85వ జన్మదిన వేడుకలు అభిమానుల సమక్షంలో జరిగాయి. ముఖ్య అతిథిగా గీతారెడ్డి పాల్గొన్నారు. జన బాంధవ బిరుదుతో రాజును సత్కరించి ఆమె మాట్లాడారు. నిజాన్ని ధైర్యంగా చెప్పి దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఆదర్శనీయ నేత రాజు అని కొనియాడారు. బడుగు బలహీనవర్గాల సమస్య ఎక్కడ వున్న అక్కడ వారి పక్షాన నిలిచే నిస్వార్థ సేవా పరాయణుడు అని చెప్పారు. శాసన సభ్యులు వివేక్ మాట్లాడుతూ.. అంబేద్కర్ సిద్ధాంతాల నిజమైన వారసుడు రాజు అన్నారు. సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ... తన చిన్న నాటి నుంచీ వెన్నంటి ప్రోత్సహించిన రాజు తన తండ్రికి కొలువు ఇప్పించి తనతో దేశం అంతా తిప్పి గద్దర్‌లోని గాన ప్రతిభను తొలిసారి ప్రజలకు పరిచయం చేసిన మానవతావాది అని ప్రశంసించారు. పోలీస్ అధికారి విష్ణు మూర్తి శ్రీనివాస్, జర్నలిస్ట్ యాదగిరి , కొల్లూరు భరత్ పలువురు దళిత బహుజన నాయకులతో పాటు అభిమానులు పాల్గొన్న సభలో రఫీ స్వాగతం తెలుపగా సంస్థ నిర్వహకురాలు ఆమని పర్యవేక్షణ చేశారు. తొలుత గాయని ఆమని సహా గాయకులు పలు సినీ గీతాలు గానం చేశారు.

అనుకరణ కళలో దిగ్గజం నేరెళ్ల వేణుమాధవ్

ప్రజాశక్తి - కల్చరల్

అనుకరణ కళను శాస్త్ర బద్ధం చేసి జాతీయ స్థాయి లో గుర్తింపు తెచ్చిన నేరెళ్ల వేణుమాధవ్ అనుకరణ దిగ్గజం అని రాష్ట్ర బెవరెజెస్ కార్పొసేషన్ మాజీ చైర్మన్ దేవీ ప్రసాద్ కొనియడారు శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంతరావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా విఖ్యాత మిమిక్రీ కళాకారుడు డాక్టర్ నేరేళ్ల వేణుమాధవ్ యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవీ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ గడ్డ పై పుట్టిన ఎందరో ప్రతిభావంతులులో నేరేళ్ల వేణుమాధవ్ ప్రముఖులు అన్నారు ఐక్య రాజ్య సమితిలో మిమిక్రీ కళను ప్రదర్శించి దేశ ఖ్యాతిని నిలిపిన వేణు మాధవ్ నాటి ప్రముఖులు నెహ్రూ రాధా కృష్ణన్ ఇందిరా గాంధీ వంటి వారి సమక్షంలో తన ప్రతిభను ప్రదర్శించి అభినందన అందుకున్నారు అని గుర్తు చేశారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ డాక్టర్ రమణ తిరుమల తిరుపతి కార్య నిర్వహణ అధికారిగా వున్న సమయంలో వేణు మాధవ్‌ను గజారోహణతో పౌర సన్మానం చేశారు అని చెప్పారు. అయన తైల వర్ణ చిత్రం గాన సభలో ఎందరో మహానుభావులు చిత్రాలలో భాగంగా ఏర్పాటు చేశామని చెప్పారు మిమిక్రీ కళాకారుడు సినీ దర్శక నిర్మాతమల్లం రమేష్ మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయంలో మిమిక్రీ కళను శాస్త్ర బద్ధం చేసి కోర్సును ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర వేణు మాధవ్ పోషించారు అని చెప్పారు .మిమిక్రీ కళా కారులు అర్‌సి ఎం రాజుభవిరి శివ శివ ప్రసాద్ షరీఫ్ అంజన్ కుమార్ మహిళా మిమిక్రీ కళాకరిణి ఉదయ శ్రీ తదితరులు మాట్లాడుతూ వేణు మాధవ్ ఎందరికో శిక్షణ ఇచ్చి కళాకారులుగా తయారు చేశారని, ఆయన వల్ల ఉపాధి అవకాశాలు ఆ కళాకారులు కి లభించిందని వివరించారు.

పెండింగ్ బిల్లులివ్వండి.. మమ్మల్ని ఆదుకోండి..

- రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ సర్పంచుల వేడుకోలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి అప్పుల్లో తమల్ని ఆదుకోవాలని మాజీ సర్పంచులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సర్పంచుల సంఘాల జెఎసి పిలుపులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌లో గల బాపూఘాట్ వద్ద మాజీ సర్పంచులు నిరసన కార్యక్రమం చేపట్టారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం ఊర్లలో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచుల పట్ల సర్కారు వివక్ష తగదన్నారు. అప్పుల బాధ తాళలేక కొందరు మాజీ సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, మరికొందరు వేధింపులు తాళలేక ఊరిడ్చి పట్టణాల్లో ఎవ్వరికీ కనపడకుండా బతకాల్సిన దుస్థితి వచ్చిందని వాపోయారు. బిల్లులు విడుదల చేయాలని రాష్ట్రమంతటా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేసి నిరసన తెలిపామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మాజీ సర్పంచులకు చెల్లించాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. బాపూఘాట్ వద్ద చేపట్టిన నిరసనలో జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, కేశబోయిన మల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, రాష్ట్ర నాయకులు గణేశ్, నవీన్‌కుమార్, పల్లె వెంకటేశం, ప్రణీత్‌చంద్, బాషబోయిన ఉప్పలయ్య, రమేశ్, పూర్ణచందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి : పిఆర్‌టియుటిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పిఆర్‌టియుటిఎస్ కోరింది. వారి సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సూచించింది. ఈ మేరకు పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శులు బీరెల్లి కమలాకర్‌రావు, గుండు లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు దశాబ్దాలుగా ఉద్యోగ భద్రత లేకుండా సమగ్ర శిక్ష ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఐదేండ్లుగా వేతనాల్లో పెరుగుదల లేక అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారి సమస్యలన్నీ పరిష్కరించి రెగ్యులరైజ్ చేస్తూ వేతనాలను పెంచాలంటూ వారు సమ్మె చేస్తున్నారని వివరించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులతో ప్రభుత్వం చర్చించి వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కెజిబివి పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే సమ్మె విరమింపజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి చెందిన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బోరబండకు చెందిన ఆకాన్ష్, రఘుబాబు అర్ధరాత్రి సమయంలో బోరబండ నుంచి మాదాపూర్ వెళ్తుండగా.. మాదాపూర్ 100 ఫీట్ రోడ్‌లోని పర్వత్ నగర్ చౌరస్తా సమీపంలో బుల్లెట్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలిలోనే ఒకరు మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మరణించారు. బైక్ నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉన్నాడని, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

రోగి మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ అత్యవసర విభాగం వద్ద సిబ్బంది ఆందోళనకు దిగారు. నిమ్స్ వర్కర్‌ను పంజాగుట్ట పోలీసులు కొట్టడాన్ని నిరసిస్తూ.. సిబ్బంది ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం ఓ రోగి .. ఎంఆర్ఐ స్కానింగ్ కోసం నిమ్స్‌కు వచ్చారు. ఈ క్రమంలో స్కానింగ్ పూర్తయిన తర్వాత చూడగా... రోగి బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో అతను.. విధుల్లో ఉన్న వర్కర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా నిమ్స్ వర్కర్‌ను పంజాగుట్ట పోలీసులు కొట్టారని ఇతర సిబ్బంది ఆరోపించారు. చివరకు ఆ బంగారు గొలుసు రోగి వద్దే లభించింది. దీంతో పూర్తిగా నిర్ధరణకు రాకుండానే దొంగతనం పేరుతో వర్కర్‌ను పోలీసులు కొట్టారని అత్యవసర విభాగం వద్ద సిబ్బంది నిరసనకు దిగారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

- ఉపాధికి చట్టం చేయాలి
- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు పి అరుణ జ్యోతి

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న పి అరుణ జ్యోతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలకు రక్షణ కల్పించాలని, ఉపాధికి చట్టం చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు పి అరుణ జ్యోతి అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో మెరుగు రమణ అధ్యక్షతన నిర్వహించిన ఐద్వా జిల్లా వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. నేడు సమాజంలో మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదని, పసి వయసు నుంచి పండు ముసలి వరకూ లైంగికదాడులు, హత్యలు, హింస పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఎవరు మారినా మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. సమాజంలో మూఢనమ్మకాలు, డ్రగ్స్, మద్యం, నీలి చిత్రాలు, పబ్బుల వల్ల యువత చెడు మార్గం పట్టి మహిళల మీద అగాయిత్యాలకు, హింసకు పాల్పడుతున్నారని తెలిపారు. తక్షణం వాటిని ఆరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళల్లో మూఢనమ్మకాలను పోషిస్తున్నారని అన్నారు. భారత రాజ్యాంగానికి బీజేపీ వల్ల ప్రమాదం ఏర్పడిందని, దాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని తెలిపారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించే మతోన్మాద శక్తులకు, విచ్ఛిన్న శక్తులకు వ్యతిరేకంగా మహిళలు పోరాడాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా మహిళా సాధికారిత కోసం నేటికీ చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో 25 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ లేకపోతే సమాజ అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళలు, దళితులు, గిరిజనులు, పేదల మీద దాడులు పెరిగాయని, వారు తినే తిండి, కట్టుకునే బట్టలు, వారి ఆచార వ్యవహారాల మీద ఆంక్షలు విధిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య లౌకిక విధానానికి వ్యతిరేకమన్నారు. మహిళా అభివృద్ధి, రక్షణ కోసం తెచ్చిన చట్టాలను డబ్బు ఉన్నవారికి, అధికారంలో ఉన్న వారికి చుట్టాలుగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల విధానాల వల్ల ధరలు పెరిగి మహిళలకు పోషకాహారం అందక, సరైన ఆహారం తినక వ్యాధుల బారిన పడి మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు 40 శాతం మంది మహిళలు రక్తహీనతతో, 50 శాతం పిల్లలు రక్తం లేక బాధపడుతున్నారని తెలిపారు. పేద మహిళల రక్షణ కోసం ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేషన్ షాపుల ద్వారా కేరళ తరహాలో 17 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శి బండి పద్మ, జిల్లా ఆఫీస్ బేరర్స్ పి నాగ సులోచన, మెహరున్నీసా బేగం, కె అమరావతి, జె సునీత, పి ప్రభావతి, ఎస్ పకీరమ్మ, పి సుమతి, బెల్లం లక్ష్మి, సంఘం జిల్లా నాయకులు కోలేటి అరుణ, ఎం నాగమణి, టి విజయ, పద్మ, కె ఉమామతి, ఎస్‌కె షైనాబీ, కుమారి, ఫరీదా, బొడ్డు పద్మ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్తామంటే తీవ్ర పరిణామాలు

- జనవరి 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభ
- జనగణనలో భాగంగా బిసి కులగణన చేపట్టాలి
- ఎమ్మెల్సీ కవితతో బిసి కుల సంఘాల నేతల భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకుంటే తాము ఎన్నికలు జరగనివ్వబోమని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ మేరకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించడంపై ఆలోచన చేయాలనీ, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీల అమలు కోసం జనవరి 3న ఇందిరాపార్కు వద్ద భారీ సభను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. దాదాపు 40కిపైగా బీసీ కుల సంఘాలకు చెందిన నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బిసిల సమస్యలు, హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తడి తెచ్చే కార్యచరణపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు.

అనంతరం ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మండల కేంద్రాల్లో, జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చేస్తామని స్పష్టం చేశారు. బిసి డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పించాక, బిసి జనాభాను వెల్లడించిన తర్వాతే ప్రభుత్వం ఎన్నికలపై ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. రానున్న జనగణనలో భాగంగా బిసి కులగణన చేపట్టాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. జనవరి 3 నాటి సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

బిసిల కోసం బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ సర్కారు నిలిపేసిందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. బిసిలకు ఆ పథకాలు ఎంతో లబ్ధి చేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మన్మోహన్ అంత్యక్రియలకు హాజరు కానున్న బిఆర్ఎస్ నేతలు

- కెటిఆర్ ఆధ్వర్యంలో ఢిల్లీకి ఎంపిలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలకు హాజరుకావాలని బిఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కెసిఆర్ ఆదేశాల మేరకు మాజీ ప్రధాని భౌతికకాయానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆధర్వంలోని ఆ పార్టీ ఎంపిలు ఢిల్లీకి వెళ్లి ఘనంగా నివాళు లర్పించనున్నారు. ఈ మేరకు కెసిఆర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్టుగా మన్మోహన్‌సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారని తెలిపారు. దాంతోపాటు తెలంగాణతో ఆయనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని పేర్కొన్నారు. ఆయన క్యాబినెట్‌లో తాను మంత్రిగా పనిచేశానని, ఆయనతో వ్యక్తిగత అనుబంధమున్నదని వివరించారు. ఆయనెంతో స్థిత ప్రజ్ఞత కలిగిన దార్శనికులని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా వారందించిన సహకారం ఈ సమాజం మరువబోదని పేర్కొన్నారు. రాష్ట్రం కోసం పోరాడుతున్న తనకు, నాటి టిఆర్ఎస్ పార్టీకి ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ వారు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో తనకు ఆయన అందించిన సహకారం మరువలేనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్ సింగ్ మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ ఘన నివాళులు అర్పిస్తున్నట్టు వివరించారు.

వనం వీడి జనంలోకి రావాలి

మావోయిస్టులకు ములుగు ఎస్పి శబరీష్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు కుటుంబాలను ములుగు జిల్లా ఎస్పి శబరీష్ పరామర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "పోరు కన్నా ఊరు మిన్న- మన ఊరికి తిరిగి రండి" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాలోని పలువురు మావోయిస్టు నాయకుల కుటుంబాలను ఎస్పి సందర్శించారు. తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన మావోయిస్టు నేతలు బడే చొక్కారావు అలియాస్ దామోదర్, గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్.. కుటుంబ సభ్యులను ఎస్పి కలిసి వారి కుటుంబ స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

మావోయిస్టు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పి శబరీష్

ఈ సందర్భంగా ఎస్పి విలేకర్లతో మాట్లాడుతూ.. మావోయిస్టులు వనం వీడి జనంలోకి రావాలని, వారిలో చాలా మందికి ఆరోగ్య సమస్యలు ఉన్నందువల్ల, ప్రస్తుతం మావోయిస్టు ఉద్యమం చివరి స్థాయికి చేరిందని అన్నారు. ఉద్యమాన్ని వదిలి జనజీవన స్రవంతిలో కలిసిపోయిన వారికి, వారి కుటుంబసభ్యులకు పోలీసులు అండగా ఉంటారని, పునరావాసం కింద రూ. 20 లక్షల రివార్డుతో పాటు ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. మావోయిస్టులు లొంగిపోయిలే కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. ఆయన వెంట ములుగు డిఎస్పి నలువాల రవీందర్, పస్రా సిఐ గద్ద రవీందర్, స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సిఆర్‌పిఎఫ్ పోలీసులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.